
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 10 ఆగస్టు 2025
www.balagamtv.com
పేజీలు 4

## అత్యున్నత స్థాయికి భారత రక్షణ ఉత్పత్తులు

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



భారత వార్షిక రక్షణ ఉత్పత్తి సర్వకాల అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఇది 2024–25లో రూ. 1,50,590 కోట్లని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 1.27 లక్షల కోట్ల ఉత్పత్తి కన్నా ఈసారి 18 శాతం వృద్ధి నమోదయింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రక్షణమంత్రి 'సమిష్టి ప్రయత్నాలను' ప్రశంసించారు. రక్షణ ఉత్పత్తి శాఖ, రక్షణ ప్రభుత్వ రంగ విభాగాలు, ప్రైవేట్ పరిశ్రమలు సహా అన్ని రకాల వాటాదారులు సమిష్టిగా ఈ మైలు రాయిని సాధించారన్నారు. 'ఈ ఆరోహణ పథం భారత రక్షణ పరిశ్రమ బలపడుతున్నది అనడానికి స్పష్టమైన సూచిక' అని పేర్కొన్నారు.

# 80 వేల కోట్ల పెట్టుబడులకు సిద్ధం

- ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్
- రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధనం కోసం.. సీఎం రేవంత్‌రెడ్డితో ఎన్టీపీసీ సీఎమ్‌డీ భేటీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నట్టు ఎన్టీపీసీ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేసింది. ఎన్టీపీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు ఎన్టీపీసీ సుముఖంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఆ ప్రతినిధి బృందం తెలిపింది. ప్రధానంగా సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టుల్లో దాదాపు 80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ వివరించారు. ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6,700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందని వివరించగా, రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరిస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టను బహుళ ప్రయోజనాలుండేలా**

**అత్యంత అధునాతనంగా నిర్మించాలి**

హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టను బహుళ ప్రయోజనాలుండేలా అత్యంత అధునాతనంగా నిర్మించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను అదేశించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారం గా హిమాయత్‌సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్‌ఆర్‌పై 'గేట్ వే అఫ్ హైదరాబాద్' నిర్మించాలని సూచించారు. ఓఆర్‌ఆర్‌కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివద్ధి చేసి మరోవైపున బాపూఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని చెప్పారు. అందుకు తగినవిధంగా డిజైన్లు రూపొందించాలని సీఎం అదేశించారు. ఓఆర్‌ఆర్‌కు ఒక వైపున ఉండే ఎకో థీమ్ పార్క్.. మరో వైపున నిర్మించే ఐకానిక్ టవర్‌కు చేరుకునేందుకు ప్రయాణా లకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని 'గేట్ వే అఫ్ హైదరాబాద్'గా డిజైన్ చేయాలని సూచించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్‌జోన్‌గా అందరిని ఆకట్టుకునేలా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు నుంచి అత్తాపూర్‌వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలనీ, గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ పరిస్థితులను బట్టి ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించాలని చెప్పారు.

తాగునీటితోపాటు వరదనీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలనీ, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్ట్ నమూనాలు పరిశీలించాలని సీఎం చెప్పారు. ఉస్మాన్‌సాగర్ హిమాయత్‌సాగర్ తాగునీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్లానింగ్ చేయాలన్నారు. స్థలం వథా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా అండర్‌గ్రౌండ్‌లో భారీగా వాటర్ స్టోరేజీ సంపు నిర్మించే సదుపాయాలు, అక్కడి నుంచి వాటర్ ట్రాన్స్‌పోర్ట్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీసరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివద్ధి చేసే పనులకు వాటర్‌ఫ్లో స్టడీస్ పక్కాగా చేసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.

### ప్రభుత్వ భవనాలపై
# సోలార్ పవర్ ప్లాంట్స్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రామ పంచాయతీ నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించిన ఆయన, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, %ూ్రాణజూ% సిఎండి ముషారఫ్ ఫారుకి, %క్ష్మజుణజఉ% సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. భట్టి విక్రమార్క అన్ని కలెక్టరేట్ల డిజైన్లు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్‌కు పంపాలని ఆదేశించారు. ఒకే నమూనాలో నిర్మించిన భవనాలకు అవసరమైన సోలార్ ప్లాంట్ డిజైన్లు హైదరాబాద్ నుంచే అందిస్తామని తెలిపారు.

**ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం**

నల్లమల డిక్లరేషన్‌లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచిత సోలార్ పంప్‌సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించిన ఈ పథకాన్ని ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్లు వారంలోగా భవనాల వివరాలు, ఖాళీ స్థలాల వివరాలు పంపాలని, సందేహాలుంటే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలును వేగవంతం చేయాలనీ, దానికోసం ఆర్వోఎఫ్‌ఆర్ భూముల వివరాలు పంపాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం చెప్పారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్‌లకు సంబంధించిన మ్యాపింగ్ ప్లాన్లు హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచే పంపిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఏవైనా ఉన్నా, వాటిని కూడా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపవచ్చని చెప్పారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఒక ప్రశ్నావళిని పంపిస్తామనీ, వివరాలు దానిలో నమోదు చేసి, వారంరోజుల్లో విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఆయా ప్రభుత్వ భవనాల వివరాలను పంపాలని చెప్పారు. నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయనీ, వాటి వివరాలు కూడా పంపాలని కలెక్టర్లకు సూచించారు.

### ఎగుమతుల తోడ్పాటుకు
## రూ.2250 కోట్లతో వ్యవస్థ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఎగుమతుల ప్రోత్సాహక అధికారిక వ్యవస్థను ప్రకటిస్తుంది. రూ 2250 కోట్ల కేటాయింపులతో ఈ ఎగుమతుల ప్రోత్సాహక విభాగం ఏర్పాటు అవుతుందని అధికారులు తెలిపారు. ట్రంప్ భారీ సుంకాలు, ప్రపంచ స్థాయిలో వాణిజ్యపరమైన ఆటుపోట్ల నడుమ తగు విధంగా పరిశ్రమలు తట్టుకునేందుకు వీలుగా ఈ ప్రమోషన్ మిషన్ ఏర్పాటు అవుతుంది. ఎగుమతిదార్లతో ఎప్పటికప్పుడు చర్చలు జరుగుతున్నాయి. ఏ విధంగా వారిని అత్యయిక స్థితిలో ఆదుకోవల్సి ఉంటుందనేది విధివిధానాల ద్వారా ఖరారు చేసుకుని ఈ వ్యవస్థను రూపొందిస్తారని అధికారులు తెలిపారు. వ్యాపార నిర్వహణ, ఎగుమతుల ప్రక్రియ సులభతరం దిశలో ఈ వ్యవస్థకు రూపకల్పన జరుగుతుంది. ఈ ఏర్పాటు గురించి ఈ ఏడాది ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రకటన వెలువరించింది.

## టెక్ హబ్‌గా హైదరాబాద్‌కు గుర్తింపు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ టెక్ హబ్‌గా పెరుగుతున్న గుర్తింపు ప్రశంసనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈయాప్‌సిస్ విస్తరించిన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈయాప్‌సిస్ విస్తరణతో హైదరాబాద్ ప్రపంచ సాంకేతిక, ఇన్నోవేషన్ కేంద్రంగా ఉన్న స్థానం మరింత బలపడిందన్నారు. సర్వీస్ ఆధారిత కంపెనీలను నడపడం తేలిక అనీ, ప్రొడక్ట్ ఆధారిత కంపెనీలు ఎక్కువ సవాళ్లు ఎదుర్కొంటాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ ఎగుమతుల్లో తెలంగాణను అగ్రస్థానంలో ఉంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కంపెనీలు యూనికార్న్ స్థాయిని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కత్రిమ మేధస్సు సాంకేతికత, పరిపాలనపై వేగంగా చూపుతున్న ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, విద్యార్థులు, వత్తి నిపుణుల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందించే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. గతంలో మూడు మాత్రమే ఉన్న యూనికార్న్‌లు ఇప్పుడు హైదరాబాద్‌లో 30–40 శాతానికి పెరిగాయనీ, 400 సీట్లు ఉన్న ఈ కొత్త కార్యాలయం సామర్థ్యం భవిష్యత్‌లో 4–6 శాతం రెట్లు పెరిగి రాష్ట్రం, నగరానికి మరింత గుర్తింపును తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయాప్‌సిస్ చైర్మెన్ బద్దం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఇన్నోవేషన్ సెంటర్ తమ ప్రయాణంలో ఒక పెద్ద మైలురాయి అనీ, ఇది తమ గ్లోబల్ కస్టమర్లకు మరింత సమర్థవంతంగా మద్దతు ఇవ్వడమే కాకుండా, కొత్త సాంకేతికతల్లో మార్పును నడిపే స్థితిని కల్పిస్తుంది అని తెలిపారు. సీఓఓ, డైరెక్టర్ బద్దం సుజానిరెడ్డి మాట్లాడుతూ ఈ పెట్టుబడి కేవలం పరిమాణం గురించే కాదనీ, అధిక నాణ్యత, చురుకైన, ప్రభావవంతమైన పరిష్కారాలను అందించడమే లక్ష్యం అన్నారు. ప్రపంచ దష్టితో ఆలోచించి, స్థానికంగా అమలు చేసే భవిష్యత్ సిద్ధ బందాన్ని మేం నిర్మిస్తున్నాం అని తెలిపారు. చీఫ్ గ్రోత్ ఆఫీసర్ గామిని ఉదయ భాస్కర్ మాట్లాడుతూ మాకు వద్ధి అంటే ఉద్దేశపూర్వకమైన ఇన్నోవేషన్, ప్రాంతీయ వైవిధ్యం, కొలవగల కస్టమర్ ప్రభావం అని పేర్కొన్నారు.

## కేటీఆర్ గుడికి వచ్చి ప్రమాణం చేస్తావా

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ, కేటీఆర్‌ను గుడికి వచ్చి ప్రమాణం చేయమని సవాల్ విసిరారు. కేటీఆర్ తన భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వచ్చి "ఫోన్ ట్యాపింగ్ చేయలేదని" ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. తాను ఏ ప్రమాణానికైనా సిద్ధమని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకరికొకరు రక్షణగా ఉన్నాయని ఆరోపించారు. సిట్ అధికారులకు ఆధారాలు ఇచ్చానని, ఫోన్ ట్యాపింగ్ విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు బీఆర్‌ఎస్‌ను వీడాలని పిలుపునిచ్చారు. దాదాపు ఆరు వేలకు పైగా ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయని ఆరోపించారు. ప్రభాకర్ రావు ఐజీ అని కేంద్రానికి తప్పుడు సమాచారం ఇచ్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్ అయ్యిందని, ఆయనను కూడా విచారణకు పిలుస్తారా అని ప్రశ్నించారు.



## సీఎం నివాసంలో రాఖీ వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రి జూబ్లీహిల్స్ నివాసంలో సందడి నెలకొంది. మహిళా మంత్రులు, ఇతర ప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావడంతో రాఖీ పండుగ కోలాహళంగా సాగింది. మంత్రులు కొండా సురేఖ గారు, ధనసరి అనసూయ సీతక్క గారు ముఖ్యమంత్రి గారికి రాఖీ కట్టారు. మాజీ మంత్రి డాక్టర్ గీతా రెడ్డి గారు ముఖ్యమంత్రి గారికి రాఖీ కట్టి ఆశీర్వదించారు. వీరితో పాటు మరెందరో సోదరీమణులు రాఖీ కట్టారు. ఈ వేడుకలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్ సోదరీమణులు ముఖ్యమంత్రి గారిని కలిసి రాఖీ కట్టారు. మలక్ పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థినులు ముఖ్యమంత్రిని కలిసి ఆప్యాయంగా రాఖీ కట్టారు. అలాగే, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద గారు, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత గారు, బీసీ కమిషన్, విద్యా కమిషన్, శిశు సంక్షేమాభివృద్ధి కమిషన్, రైతు కమిషన్ కు చెందిన మహిళా ప్రతినిధులు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు గారితో పాటు మహిళా ప్రతినిధులు రేవంత్ రెడ్డి గారికి రాఖీ కట్టారు.

## ఇద్దరు జవానులు మృతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో ఇద్దరు జవానులు మరణించగా, అనేక మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ శనివారం తొమ్మిదవ రోజుకు చేరుకుంది. ఇది ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో అత్యంత దీర్ఘమైన వాటిలో ఒకటి. ఆగస్టు ఒకటిన భద్రతా బలగాలు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టినప్పటి నుంచి ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే ఉగ్రవాదులు ఏ గ్రూప్‌కు చెందిన వారన్నది ఇంకా తెలియలేదు. అడవిలో ఉగ్రవాదుల కదలికలను గుర్తించేందుకు భద్రతాబలగాలు డ్రోన్లు, హెలికాప్టర్లు వాడుతున్నాయి. దాక్కుని ఉన్న ఉగ్రవాదులను నిర్వీర్యం చేయడానికి భద్రతా బలగాలకు పారా కమాండోలు కూడా సహకరిస్తున్నారు.

## 334 రాజకీయ పార్టీల తొలగింపు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో 334 రాజకీయ పార్టీలను రిజిస్టర్ జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. 2019 నుంచి ఏ ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈసీ వివరాల ప్రకారం, రిజిస్టర్ అయినప్పటికీ గుర్తింపు లేని ఈ పార్టీలు ఆరు సంవత్సరాలుగా ఎన్నికల్లో పాల్గొనలేదు. ముఖ్యమైన అర్హత షరతు నెరవేర్చడంలో విఫలమవడంతో జాబితా నుంచి తొలగించినట్లు శనివారం స్పష్టం చేసింది. గుర్తింపు లేని ఈ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవిగా పేర్కొంది. తొలగించిన పార్టీల కార్యాలయాలు భౌతికంగా ఎక్కడా లేవని కూడా ఈసీ తెలిపింది.

మొత్తం 2,854 నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో 334 పార్టీలు తొలగించడంతో, ప్రస్తుతానికి 2,520 పార్టీలు రిజిస్టర్ జాబితాలో మిగిలి ఉన్నాయని వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని ఈసీ వివరించింది.



## కేసీఆర్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాఖీ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సోదరీమణులు లక్ష్మీబాయి, జయమ్మ, వినోదమ్మ రాఖీ కట్టారు. అన్నా చెల్లెళ్లకు, అక్కాదమ్ముల్ల మధ్య ప్రేమ, గౌరవం, రక్షణలాంటి బంధాలను పెంచే పండుగగా రాఖీని జరుపుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అక్కాచెల్లెల్లందరికీ కేసీఆర్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## వారం పాటు వర్షాలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

క్యుములోనింబస్ మేఘాలు, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30–40 కి.మీ. వేగంతో గాలులు వీయవచ్చని హెచ్చరించింది.

13వ తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, 13, 14, 15 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది.

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో శనివారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. హిమాయత్‌నగర్, నారాయణగూడ, తార్నాక, ఓయూ, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, చార్మినార్, చాంద్రాయ ణగుట్ట, యాక్‌త్‌పు, ఫలక్‌నుమా, ఉప్పుగూడ, జియగూడ, చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, ఎల్‌బీనగర్, బోడుప్పల్, మేడిపల్లి, ఖైరతాబాద్, అమీర్ పేట, జూబ్లీ హిల్స్, షేక్‌పేట్, టోలిచౌకి, అత్తాపూర్, నార్సింగి, మణికొండ, లాలాపేట, ఎర్రగడ్డ, సనత్‌నగర్, మియాపూర్, గచ్చిబౌలి, మదాపూర్, లక్డీకాపుల్, మాసాబ్‌ట్యాంక్, కోఠి, మలక్‌పేట్, చంపాపేట్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్, మంసూరాబాద్, బీఎన్‌రెడ్డి నగర్, ఉప్పల్ ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. వర్షం కారణంగా రహదారులు జలమయం అయ్యాయి. పెద్దఅంబర్‌పేట్ నుంచి నగరానికి వెళ్లే రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భాగ్యలత వద్ద నీటి నిల్వతో వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా, పెద్దఅంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ వైపు ప్రయాణం కూడా మందగించింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఏ పార్టీ వైపు చూడను

- రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవ చేస్తా
- ఎమ్మెల్యే మల్లారెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 73 సంవత్సరాల వయస్సులో బీజేపీ, టీడీపీ వేరే ఇతర పార్టీల వైపు చూసే అవసరం తనకు లేదన్నారు. అసలు రాజకీయమే వద్దనుకుంటున్నానని హాట్ కామెంట్స్ చేశారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గం నుంచి విచ్చేసిన మహిళలు ఆయన రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో ఉన్నానని, ఏ పార్టీ వైపు చూసే పరిస్థితి లేదన్నారు. ఎంపీగా, మంత్రిగా పనిచేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని, మరో మూడు సంవత్సరాలు తన పదవీకాలం ఉందన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామను కుంటున్నానని తెలిపారు. గతంలో రాఖీ పౌర్ణమి రోజే తన తొలి ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించినట్టు గుర్తు చేశారు. త్వరలోనే ఉత్తరప్రదేశ్ వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి 50 ఎకరాల్లో హెల్త్ సిటీ ప్రారంభిస్తానని తెలిపారు.అంతేకాకుండా బీహార్, పశ్చిమబెంగాల్, వైజాగ్ ఇలా దేశంలోని ముఖ్య పట్టణాల్లో యూనివర్సిటీలను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు పేర్కొన్నారు.

# దోస్త్ రిపోర్టింగ్ గడువు పొడిగింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ 2025-26 స్పెషల్ ఫేజ్ గడువును పొడిగించినట్టు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వీ బాలకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 6 వరకు రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా, ఆగస్టు 12 వరకు పొడిగించామని తెలిపారు.

నీటిపారుదలశాఖలో ఇంజినీర్ల ఉద్యోగోన్నతులకు అడ్డంకులు తొలగించి దక్షిణ తెలంగాణ అధికారులకు ప్రాధాన్యం ఇవ్వడంపై హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు రాపోలు రవీందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, పూర్వపు అధ్యక్షుడు మహేందర్, ఏఎన్ఎస్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు

33 ఏళ్ల తర్వాత డీపీసీతో పాటు 262 మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడం సంతోషకరమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1122 ఇంజినీర్లను నియమించడంతో పనిభారం తగ్గుతుందని, తమ విజ్ఞప్తికి స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.




# బండి సంజయ్‌ను కలిసిన డాక్టర్ కుమార్ రాజా చిట్టూరి

**బలగం టీవీ, హైదరాబాద్**

కరీంనగర్ ఎంపీ, మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను, కార్పొరేట్ శిక్షణ నిపుణుడు, కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు డాక్టర్ కుమార్ రాజా చిట్టూరి ఆదివారం కరీంనగర్‌లో కలిశారు. ఈ సందర్భంగా యువత నైపుణ్యాభివృద్ధి, మహిళల ఉపాధి, పరిశ్రమలు-విద్యా సంస్థల అనుసంధానంపై విస్తృతంగా చర్చించారు. డాక్టర్ కుమార్ రాజా మాట్లాడుతూ, విద్యార్థులు అకడమిక్ జ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవం పొందేలా పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారం బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొనవలసిందిగా బండి సంజయ్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సదస్సులో కార్యాలయ సమానత్వం, భద్రత, వృత్తి అభివృద్ధి వంటి అంశాలపై ప్రపంచ స్థాయి చర్చలు జరగనున్నాయని ఆయన వివరించారు.

# తప్పుడు ప్రచారం జరుగుతోంది: చిరంజీవి

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని మెగాస్టార్ చిరంజీవి తీవ్రంగా ఖండించారు. ఫిలిం ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశంలో, సినీ కార్మికులకు 30 శాతం వేతనాలు పెంపుపై తాను హామీ ఇచ్చినట్టు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఫిలిం ఫెడరేషన్‌కు చెందిన కొందరు సభ్యులు తనను కలిశారనీ... వారి డిమాండ్లకు తాను అంగీకరించి, షఉటింగ్స్ త్వరలో ప్రారంభిస్తానని హామీ ఇచ్చాననీ... మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని చిరంజీవి తన ప్రకటనలో తెలిపారు. “నేను ఫెడరేషన్ నుంచి ఎవరినీ కలవలేదు. అసలు వాస్తవాలు వెల్లడించడానికే ఈ ప్రకటన చేస్తున్నాను” అని ఆయన స్పష్టం చేశారు. ఇది మొత్తం పరిశ్రమకు సంబంధించిన సమస్య అని, ఏ ఒక్క వ్యక్తి ఏకపక్షంగా హామీలు ఇచ్చి పరిష్కరించలేరని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఫిలిం ఛాంబర్ అత్యున్నత సంస్థ అని, ఆ సంస్థ మాత్రమే కార్మిక సంఘాలతో, ఇతర భాగస్వాములతో చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారం కనుగొంటుందని చిరంజీవి వివరించారు.

అలాంటి పరిష్కారం లభించే వరకు ఇలాంటి నిరాధారమైన, దురుద్దేశపూర్వకమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. పరిశ్రమలో గందరగోళం సృష్టించే ఇలాంటి కథనాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చిరంజీవి తన ప్రకటనలో తేల్చిచెప్పారు.

# ఢిల్లీలో గోడ కూలి 8 మంది మృతి

**లగం టీవీ, హైదరాబాద్**

ఢిల్లీలో ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు 100 అడుగుల పొడవు ఉన్న గోడ ఒక్కసారి కూలిపోయింది. ఆ శిథిలాలన్నీ అక్కడే ఉన్న మురికివాడలపై పడ్డాయి. దీంతో ఎనిమిది మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జైత్‌పుర్‌లోని హరినగర్‌లో ఆ ఘటన జరిగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఓ ఇంటి గోడ కూలింది. ఘటనాస్థలిలో ఒక పాత ఆలయం ఉంది. ఆ పక్కనే అనేక మంది గుడిసెల్లో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసన భారీ వర్షాలకు అకస్మాత్తుగా గోడ కూలింది. దీంతో అనేక మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. ఎనిమిది మంది చనిపోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నట్లు సమా చారం. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబీనా (25), డాలీ (25), రుఖ్సానా (6), హసీనా (7)గా అధికా రులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నామని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న నివాసాలలో ఉండొద్దని అధికారులు వెల్లడించారు. విపత్తులో అలాంటి సంఘటన జరగకుండా ఉండటానికి ప్రజలను తరలించామని అడిషనల్ డీసీపీ సౌత్ ఈస్ట్ ఐశ్వర్య వర్మ తెలిపారు.

# ఉదయం మూసి, మధ్యాహ్నం తెరిచిన మూసీ ప్రాజెక్టు గేట్లు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో శనివారం మధ్యాహ్నం నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని మూసి ప్రాజెక్టు ఐదు గేట్లను అధికారులు ఎత్తి 98 25 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం ఉదయం వరద ఉధృతి తక్కువ కావడంతో 3, 7, 8 , 10 గేట్ల ను మూసివేశారు. రెండవ నెంబర్ గేట్ ను రెండు అడుగుల మేరకు దించారు. వరద ఉధృతి అధికం కావడంతో అధికారులు మధ్యాహ్నం రెండవ గేటు తో పాటు మూసివేసిన 3, 7, 8 ,10 గేట్లను మూడు అడుగుల మేరకు పైకి ఎత్తి 98 25 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

# జార్ఖండ్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**బలగం టీవీ, హైదరాబాద్**



చండిల్: దేశంలో రైలు ప్రమాదాలు జరుగుతున్నా..కేంద్రరైల్వేశాఖ ఆశించినమేర కదలటంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా జార?ండ్‌లోని సెరైకేలా-ఖర్సవాన్ జిల్లాలోని చండిల్ సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. గూడ్స్ రైలులోని 20కిపైగా బోగీలు పట్టాలు తప్పినట్టు సమాచారం. దాంతో ఆగేయ రైల్వేలోని చండిల్-టాటానగర్ సెక్షన్ మధ్య రైలు సేవలు నిలిచిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఒక అధికారి తెలిపారు. సమాచారం ప్రకారం, ఐరన్ లోడ్‌తో వెళు _న్న గూడ్స్ రైలు టాటానగర్ నుంచి పురులియాకు వెళు తోంది. చండిల్ స్టేషన్ దాటిన తర్వాత గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రైలు బోగీలు పక్కనే ఉన్న ట్రాక్‌పై వచ్చాయి. దీంతో ఆ మార్గం గుండా వెళ్లాల్సిన వందేభారత్ తో సహా పలు రైళ్లు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

# 15న అలస్కాలో ట్రంప్, పుతిన్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ నెల 15వ తేదీన అలస్కాలో సమావేశమవుతారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధంపై ఇరువురు నేతలు చర్చిస్తారు. పుతిన్‌తో సమావేశం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో తెలియజేయగా రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దానిని ధృవీకరించారు. అయితే ఏ పరిష్కారం కనుగొన్నప్పటికీ అందులో తమకు భాగస్వామ్యం ఉండాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పష్టం చేశారు. దీర్ఘకాలిక శాంతి కోసం భాగస్వాములందరితో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. యుద్ధం ఆగిపోవాలంటే ఉక్రెయిన్ తన భూభాగాన్ని కోల్పోవాల్సి ఉంటుందని అంతకుముందు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. ‘మూడున్నర సంవత్సరాలుగా ఆ భూభాగం కోసం పోరాడుతున్నారు. అనేక మంది రష్యన్లు చనిపోయారు. అనేక మంది ఉక్రెయిన్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు’ అని ట్రంప్ శుక్రవారం అధ్యక్ష భవనంలో చెప్పారు. ఇది చాలా సంక్లిష్టమైన సమస్య అని అంటూ ఇరువురి ప్రయోజనం కోసం భూభాగాలను ఇచ్చిపుచ్చుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. అయితే ప్రతిపాదన ఏ విధంగా ఉంటుందో ఆయన వివరించలేదు. కాగా తూర్పు ఉక్రెయిన్‌లోని దాన్‌బాస్ ప్రాంతాన్ని పూర్తిగా రష్యా తీసుకోవాలని, దానికి బదులుగా తాను పాక్షికంగా ఆక్రమించిన ఖెర్సాన్, జపోర్జియా ప్రాంతాలను ఉక్రెయిన్‌కు ఇచ్చి వేయాలని ట్రంప్ ప్రతిపాదించారని సీబీఎస్ న్యూస్ చెప్పింది. ట్రంప్ దూత స్టీవ్ విట్‌కాఫ్ వద్ద రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఇదే ప్రతిపాదన ఉంచారని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక తెలిపింది. ప్రాదేశిక రాయితీలకు ముందస్తు షరతులను అంగీకరించే ప్రశ్నే లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇదివరకే తేల్చి చెప్పారు. ‘ఉక్రెయిన్ ప్రాదేశిక అంశానికి సంబంధించిన జవాబు మా రాజ్యాంగంలో ఉంది. దాని నుంచి ఎవరూ పక్కకు వెళ్లలేరు. ఉక్రెయిన్ ప్రజలు తమ భూభాగాన్ని ఆక్రమణదారులకు అప్పగించరు’ అని ఆయన శనివారం స్పష్టం చేశారు. శాంతి స్థాపనకు దోహదపడే వాస్తవ పరిష్కారానికి తాము సిద్ధమేనని చెప్పారు.



# భారత్-ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) త్వరలోనే అమలులోకి వస్తుంది. ఈ మేరకు ప్రకటన వెలువడుతుంది. అధికార వర్గాలు శనివారం ఈ విషయం వెల్లడించాయి. ఇప్పుడు ఈ ఒప్పంద అరబీ ప్రతిని ఒమన్‌లో రూపొందిస్తున్నారు. ఆ తరువాత ఉభయదేశాల మంత్రి మండలి సమావేశాలలో దీనిని ఆమోదించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఒప్పందం ఖరారు తరువాతి ప్రకటనపై ఇరు దేశాల ఉన్నత నాయకత్వాలు అంగీకారానికి వచ్చాయి. ఇక ఎప్పుడు దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందనేది త్వరలోనే తెలుస్తుందని అధికారులు వివరించారు. రెండు మూడు నెలలోపే ఒప్పందం వెలువడుతుందని తెలిపారు.

# వైషమ్యాలపై ఐక్యంగా పోరాడాలి

## ప్రకాశ్‌రాజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశం విశ్వగురు ఏలుబడిలో వైషమ్యాలతో కొట్టుమిట్టాడుతుందని, ఈ తరుణంలో అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ పిలుపునిచ్చారు. జాతిలో వైవిధ్యాన్ని చెడగొట్టే విభేదాలను ఎదుర్కోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి అందరికీ దిశానిర్దేశం కావాలని సూచించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొ. కొత్తపల్లి జయశంకర్ స్మారకోపన్యాసంలో ‘వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం’ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో వెలుగుతున్న అభివృద్ధి జ్యోతి వెనుక జయశంకర్ సార్ అగ్గిపుల్లలాగ ఉన్నారని ఉపమానించారు.

తనపై వ్యతిరేకులు బురద చల్లినా, జయశంకర్ సార్ స్ఫూర్తితో ఎన్ని సార్లు అయినా తుడుచుకొని ముందుకు వెళ్తానని ప్రకాశ్‌రాజ్ స్పష్టం చేశారు. దేశంలోని వైవిధ్యతను ఎక్కువగా చూశానని, దాన్ని కాపాడటమే తన కర్తవ్యం అన్నారు. కొంతమంది దొంగలు తమ ఎజెండా కోసం జెనోఫోబియాను వాడుకొని బ్రిటిష్ కాలపు విభజించు-పాలించు సూత్రాన్ని కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. హిట్లర్ కూడా ఇదే మార్గాన్ని అనుసరించాడని, ప్రస్తుతం ప్రపంచం కోల్డ్‌వార్, కమ్యూనల్‌వార్, టారిఫ్‌వార్‌ల చక్రంలో నడుస్తోందని వ్యాఖ్యానించారు.



# అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**బలగం టీవీ, హైదరాబాద్**

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శనివారం పెద్దపల్లిలో ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల వల్లే ఈ ఏడాది ఎస్సారెస్పీ ఆయకట్టు పడావు పడిందని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధుకర్ తదితరులు పాల్గొన్నారు.




# ఆదివాసుల హక్కుల కోసం పెద్దపల్లిలో నిరసన

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద శనివారం పౌరహక్కుల సంఘం, ప్రజాసంఘాల నాయకులు నిరసన చేపట్టారు. మధ్య భారతదేశంలో ఆదివాసులపై జరుగుతున్న హింసను ఖండిస్తూ, వారి హక్కుల పరిరక్షణ కోసం గళమెత్తారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రవి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి పాల్గొన్నారు.




# ముగిసిన సీబీఎస్ఇ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

**బలగం టీవీ, హైదరాబాద్**

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీబీఎస్ఇ క్లస్టర్–7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీల శుక్రవారం ముగిసింది. సంబంధిత విభాగాల్లో అత్యుత్తమ ప్రయాణాత్మక ప్రదర్శనతో పలు స్కూల్స్‌కు టైటిళ్లు దక్కాయి.

ఫలితాలు:

అండర్–14: విపీఎస్ పబ్లిక్ స్కూల్ (విజయవాడ) ు ప్రథమ స్థానముబీ టైమ్ స్కూల్, రాజేంద్రనగర్ మరియు రంగారెడ్డి ప్రతిజోన్‌లు ఉన్నతస్థానాల్లో నిలిచాయి.

అండర్–17: శ్రీ ప్రకాశ్ ఎనర్జీ స్కూల్ (పెద్దాపురం, తూర్పు గోదావరి) ు ప్రథమ స్థానముబీ సర్ సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ పశ్చిమగోదావరిలో రెండో స్థానం సాధించింది.

అండర్–19: శ్రీ ప్రకాశ్ ఎనర్జీ స్కూల్ ు ప్రథమ స్థానముబీ సర్ సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ రెండో స్థానం.

జాతీయ ఎంపిక:

అండర్–14: ఎస్.మనస్వి, రిద్ధిటీరో, కే. నైనా, వంశిక.

అండర్–17: జి. వర్ణిక, తనిష్క, దాస్, మిద్ది శాంతి జ్యోతి.

అండర్–19: సాయి సుదీక్ష, రిషికా తులసి, లినేషియా, ఎం.దర్శిక ు వీరన్నీ తదుపరి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

తొడగివోలుగా, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు సమకూర్చారు. పోటీల పరిశీలకుడు పద్మారావు, చీఫ్ రెఫరీ శంకర్, అసోసియేట్ చీఫ్ రిఫరీ రామచంద్రరావు బాబురావు, ఒతినేల్, ఎండీ గౌస్, రవి, గంగారాం తదితరులు కార్యనిర్వహణలో పాల్గొన్నారు. క్రీడా అధికారులు mengatakan ఈ క్లస్టర్–పోర్ట్ విజయవంతంగా జరిగిందని, ఎంపికైన యువ ప్రతిభలు దేశస్థాయికి సిద్ధం అయ్యేలా వేగంగా శిక్షణకు మార్గసూచన కల్పిస్తామని తెలియజేశారు.

# మానకొండూరులో యూరియా అందుబాటు కల్పించాలి

## మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**బలగం టీవీ, హైదరాబాద్**



మానకొండూరు: నియోజకవర్గంలోని అన్ని సొసైటీలలో యూరియాను సమృద్ధిగా అందుబాటులో ఉంచి ప్రతి రైతుకు అందేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. శనివారం తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు చెప్పులను లైన్లో పెట్టే దుస్థితి నెలకొందని విమర్శించారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు ఇలాంటి ఇబ్బందులు పడలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆ పరిస్థితులు తెచ్చిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ యూరియా కొరత లేదని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, రైతులను తాగుబోతులంటూ సంబోధించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రైతు వేదికలో కూర్చొని రాజకీయాలు మాట్లాడిన సత్యనారాయణకు, ఆ వేదికలను ఎవరు నిర్మించారో తెలుసుకోవాలని రసమయి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఎవరు 40కి పైగా యూరియా బస్తాలు తీసుకెళ్లలేదని, రైతుబంధు, రైతు బీమా అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కరెంటు కోతలేని పాలనను అందించిందని గుర్తు చేశారు.

మిడ్ మానేరు, రంగనాయక సాగర్, తోటపల్లి, అనంతగిరి ప్రాజెక్టులను పూర్తి చేసి లక్ష ఎకరాలకు నీరు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని చెప్పారు. ప్రస్తుతం రైతులు సొసైటీల వద్ద యూరియా కోసం పోలీసు బందోబస్తు మధ్య క్యూలలో నిలబడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

కాలువలు అసంపూర్తిగా మిగిలిపోవడం, అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో ఎమ్మెల్యే వైఫల్యం కనబరుస్తున్నాడని రసమయి ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సిద్ధం వేణు, రావుల రమేష్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, గంప వెంకన్న, మాతంగి లక్ష్మణ్, ఉల్లెంగుల ఏకానందం, పాశం అశోక్ రెడ్డి, ఎడ్ల బుచ్చిరెడ్డి, రామిడి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మార్కండేయ స్వామి శోభాయాత్రలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, హైదరాబాద్**

నూలు పౌర్ణమి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని మార్కండేయ దేవస్థానంలో శనివారం నిర్వహించిన శోభాయాత్రను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. అనంతరం దేవాలయం నుండి నేతన్న విగ్రహం వరకు సాగిన ర్యాలీలో పాల్గొని, నేతన్న నేసిన వస్త్రం మరియు పూలమాలతో విగ్రహానికి ఆలంకరించారు.

# వివాహం ఇష్టంలేక యువతి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**



పెద్దపల్లి పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన వనపర్తి సంధ్య (27) వివాహం ఇష్టంలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వనపర్తి కనుకయ్య, లక్ష్మి మూడో కుమార్తె అయిన సంధ్యకు ఈ నెల 14న పెళ్లి నిశ్చయమైంది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు పెళ్లి ఏర్పాట్లలో ఉండగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ప్రాణాలు తీసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్‌రెడ్డి తెలిపారు.

# నాలుగేండ్ల తమ్ముడికి ప్రాణం పోసిన అక్క

## - కిమ్స్ హాస్పిటల్‌లో రాఖీ కట్టి ధైర్యం చెప్పిన సోదరి

**బలగం టీవీ, హైదరాబాద్**



రాఖీ కట్టి ధైర్యం చెప్పడం ఒకటి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడి ప్రాణం కాపాడటం మరొకటి. ఆ రెండోది చేయాలంటే అసాధారణ ధైర్యం కావాలి. మానవ సంబంధాలు క్రమంగా క్షీణిస్తున్న ఈ రోజుల్లో, ఒక అక్క తన తమ్ముడి కోసం ప్రాణాలకే సవాలు విసిరింది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదేండ్ల బాలుడికి తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియఅంటే ఎముక మజ్జ లోపంగా నిర్ధారణ అయ్యింది. ఇంటర్ చదువుతున్న అక్క తమ్ముడికి ధైర్యం చెప్పి, తన శరీరంలోని మూలకణాలను దానం చేసి అతని ప్రాణాన్ని రక్షించింది. రాఖీ పండుగ రోజు సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో తమ్ముడికి రాఖీ కట్టి, "నీ కోసం నేను ఉన్నాను తమ్ముడు" అని ప్రేమగా చెప్పింది. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ కుమార్ తోట మాట్లాడుతూ ఇది అక్కా, తమ్ముళ్ల అనుబంధానికి నిజమైన నిదర్శనం అనీ, అపోహలను పక్కన పెట్టి ధైర్యంగా తమ్ముడి ప్రాణం కాపాడిందన్నారు.

# రవాణా, పర్యాటక రంగాల్లో విశ్వాసం పెంపు దిశగా కృషి చేయాలి

## మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**



సదరన్ ట్రావెల్స్ 50 ఏండ్లుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవాణా, పర్యాటక రంగాల్లో ప్రయాణికులకు మరింత విశ్వాసం కల్పించేలా వారు కషి చేయాలని సూచించారు. శనివారం లక్డికాపూల్‌లో సదరన్ ట్రావెల్స్ కొత్త ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని మంత్రులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, అందులో భాగంగా టూరిజం పాలసీని రూపొందించినట్టు తెలిపారు. రెవెన్యూ పెంపుతో పాటు పర్యాటకులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సదరన్ ట్రావెల్స్ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నదని తెలిపారు. నిర్వాహకులు సేఫ్టీ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సదరన్ ట్రావెల్స్ హైదరాబాద్ కేంద్రంగా విస్తరిస్తోందని అభినందించారు. నగరంలో హాస్పిటాలిటీ హొటల్‌ను ప్రారంభించనున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి కంటే ముందే తెలంగాణలో హొటల్ నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 శాఖలు ఉన్నాయని, 50 ఏండ్ల అనుభవంతో విభిన్న హాలిడే ప్యాకేజీలపై భారీ తగ్గింపులు అందిస్తున్నామని వెల్లడించారు.



# జింబాబ్వేపై న్యూజిలాండ్ ఘన విజయం

## ఇన్నింగ్స్ 369 పరుగుల తేడాతో వైట్‌వాష్

**బలగం టీవీ, హైదరాబాద్**

క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా న్యూజిలాండ్ ఘన విజయం నమోదు చేసింది. రెండో టెస్టులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన కివీస్, ఆతిథ్య జింబాబ్వేను ఇన్నింగ్స్ 369 పరుగుల తేడాతో మట్టికరిపించింది. మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 125 పరుగులకే కుప్పకూలిన జింబాబ్వే, రెండో ఇన్నింగ్స్‌లోనూ మరింత దారుణ ప్రదర్శన చేసింది. న్యూజిలాండ్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర (165), డెవాన్ కాన్వే (153), హెన్రీ నికోల్స్ (150) శతకాలతో రాణించగా, బౌలర్ల విరుచుకుపడటంతో జింబాబ్వే చతికిలపడింది. కుర్ర స్పిన్నర్ జకరీ ఫౌల్కీ 5 వికెట్లు (5/37) పడగొట్టగా, పేసర్ మ్యాట్ హెన్రీ (2/16) కీలక విజయాల్లో భాగమయ్యాడు. ఫలితంగా శాంట్నర్ సేన సిరీస్‌ను 2–0 తేడాతో సొంతం చేసుకుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. తొలి టెస్టులో భారీ విజయం సాధించిన కివీస్, రెండో మ్యాచ్‌లోనూ తిరుగులేని ఆటతీరు ప్రదర్శించి జింబాబ్వేకు వైట్‌వాష్ ఇచ్చింది.



# యువ భారత్ ఓటమి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన అనధికారిక రెండో టీ20లో యువ భారత్ ఓటమిపాలైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 'ఏ' 114 పరుగుల తేడాతో ఆసీస్ 'ఏ'పై పరాజయం ఎదుర్కొంది. తొలుత ఆసీస్ 'ఏ' నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 187 పరుగులు చేసింది. ఓపెనర్ అలీసా హిలీ (70) ధనాధన్ అర్ధసెంచరీతో జట్టుకు పోరాడే స్కోరు అందించింది. రాధా యాదవ్ (2/35)కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యువ భారత్ 15.1 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. దినేశ్ బ్రింద (21), మిన్ను మణి (20) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఉమా ఛెత్రీ, తనూజ కన్వర్ కనీసం పరుగుల ఖాతా తెరువలేకపోయారు. కిమ్ గారెత్ (4/7), అమీ ఎడ్గర్ (2/17), ఫ్లింటాఫ్ (2/23) భారత పతనంలో కీలకమయ్యారు.




# వడ్డే నవీన్ రీ-ఎంట్రీ

## 'టాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫస్ట్ లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ తెలుగు నటుడు వడ్డే నవీన్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపైకి రానున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ను కమల్ తేజ నార్ల దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. వడ్డే క్రియేషన్స్ బ్యానర్‌పై వడ్డే నవీనే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌తో పాటు వరలక్ష్మి శరత్‌కుమార్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. రాఖీ పండుగ సందర్భంగా చిత్ర యూనిట్ ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో వడ్డే నవీన్ కానిస్టేబుల్ గెటప్‌లో దర్శనమిచ్చారు. చిత్ర బృందం వివరాల ప్రకారం, ఈ సినిమా ఆసక్తికరమైన కథా నేపథ్యంలో రూపొందుతోంది.



# 'ఓనం సాంగ్' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం కె-ర్యాంప్ నుంచి మేకర్స్ శనివారం తొలి పాటను విడుదల చేశారు. యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన 'ఓనం సాంగ్' లిరికల్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పండగ వాతావరణాన్ని నింపుతోంది.ఈ గీతానికి ప్రముఖ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చి, గాయని సాహితీ చాగంటితో కలిసి ఆలపించారు. సురేంద్ర కృష్ణ అందించిన సాహిత్యం పాటకు మరింత ఉత్సాహాన్ని తెచ్చిపెట్టింది."ఈ పాట చిత్రీకరణ నిజమైన పండగలా అనిపించింది. మేం ఎంతగా ఎంజాయ్ చేశామో, మీరందరూ కూడా ఈ పాటను అంతే సెలబ్రేట్ చేస్తారని ఆశిస్తున్నా" అని కిరణ్ అబ్బవరం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కిరణ్ సరసన యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. కిరణ్ కెరీర్‌లో ఇది మొదటి పూర్తిస్థాయి కామెడీ రోల్ అని చిత్రబృందం వెల్లడించింది.

# నిర్మాతలతో చర్చలు విఫలం..!

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్‌లో వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమింప జేయాలనే ప్రయత్నాలు విఫలమయ్యాయి. నిర్మాతలతో ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు శనివారం నిర్వహించిన సుదీర్ఘ చర్చలు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. రేపటి నుంచే ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ చైర్మన్ అనిల్ తెలిపారు.

రోజువారీ వేతనాలు పొందుతున్న 13 సంఘాలకు సమానంగా వేతనాలు పెంచాలని తమ డిమాండ్‌పై ఫెడరేషన్ నేతలు మగ్గిపడ్డారు. నిర్మాతల ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు. అలాగే, నిర్మాతలు పెట్టిన నాలుగు షరతులను కూడా తిరస్కరించారు. నిర్మాతల నిర్ణయాలు యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని, ఫెడరేషన్‌ను విభజించే ప్రయత్నం జరుగుతోందని నిర్మాత వల్లభనేని అనిల్ తీవ్రంగా విమర్శించారు.

# నవంబర్‌లో ఎస్ఎస్ఎంబీ29 ఫస్ట్ లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్‌స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న ఎస్ఎస్ఎంబీ29 సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి విడుదల చేశారు. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను 2025 నవంబర్‌లో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌ను, సినిమా అభిమానులు మరియు మహేశ్ బాబు అభిమానుల కోసం ప్రత్యేక లేఖను విడుదల చేశారు. "సినీప్రియులకు, మహేశ్ బాబు అభిమానులకు నమస్కారం. ఎస్-ఎస్ఎంబీ29 షూటింగ్ ప్రారంభించి చాలా కాలమైంది. ఈ ప్రాజెక్ట్‌పై మీరు చూపిస్తున్న ఆసక్తికి ధన్యవాదాలు. ఇది భారీ స్థాయిలో రూపొందుతున్నందున, కేవలం కొన్ని ఫోటోలు లేదా ప్రెస్‌మీట్‌తో పూర్తి వివరాలు చెప్పడం సాధ్యం కాదు. నవంబర్ 2025లో మహేశ్ బాబు లుక్‌ను ఆవిష్కరిస్తాం. ఇంతకు ముందు ఎప్పుడూ చూడని విధంగా ఈ చిత్రం ఉండబోతోంది. మీ సహనానికి ధన్యవాదాలు" అని రాజమౌళి లేఖలో పేర్కొన్నారు.






# 'పరదా' ట్రైలర్ విడుదల



**బలగం టీవీ, హైదరాబాద్**

అనుపమ పరమేశ్వరన్ కథా నాయికగా, దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పరదా'.

ప్రవీణ్ కాండ్రేగుల దర్శకుడు. మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసిన హీరో రామ్ పోతినేని మాట్లాడుతూ, 'ఈ సినిమా స్టోరీ లైన్ నాకు తెలుసు. చాలా అద్భుతమైన కథ. బాలీవుడ్‌లో 'లాపతలేడీస్' లాంటి సినిమాలు చూస్తుంటాం. మనం ఎందుకు అలాంటి సినిమాలు చేయలేమని ఆలోచిస్తుంటాం. ఇలాంటి సినిమాలు నిర్మిస్తున్న నిర్మాతల్ని తప్పకుండా ప్రోత్సహించాలి. ఇలాంటి సినిమాలు విజయాలు సాధిస్తే, నిర్మాతలకి ధైర్యం వస్తుంది. ప్రవీణ్ తీసిన 'సినిమా బండి' నాకు చాలా ఇష్టం. ఈ సినిమాతో అతను మరో అద్భుత విజయం సాధించాలని కోరుకుంటున్నాను. గోపీసుందర్ మ్యూజిక్ అద్భుతంగా ఉంది. అనుపమ నాకు చాలా మంచి ఫ్రెండ్. ఏ క్యారెక్టర్ ఇచ్చిన 100% ఎఫర్ట్ పెడుతుంది. తనకి సినిమా అంటే చాలా ప్యాషన్. ఈ సినిమాలో ఫెంటాస్టిక్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. మెగాస్టార్ బర్త్‌డే కానుకగా ఈనెల 22న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. మిస్ అవ్వకుండా చూడండి' అని అన్నారు. 'ఈ సినిమా నాకు ఎంత ఇంపార్టెంటో రామ్‌కి బాగా తెలుసు. నాకు సపోర్ట్‌గా నిలిచి, ఈ వేడుకకు వచ్చారు. ఇదొక మంచి సినిమా. తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది. అలాగే ఆలోచించేలా చేస్తుంది' అని హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ చెప్పారు.

# 'మాస్ జాతర' టీజర్ రిలీజ్ డేట్ ఫిక్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం 'మాస్ జాతర' నుంచి అభిమానులకు గుడ్ న్యూస్ వచ్చింది. రాఖీ పండుగ సందర్భంగా టీజర్ విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 11వ తేదీ ఉదయం 11:08 గంటలకు టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేయడంతో సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. వినాయక చవితి కానుకగా ఆగస్టు 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం నిర్మాతలు సన్నాహాలు ముమ్మరం చేశారు. టీజర్ అప్‌డేట్‌తో ప్రచార కార్యక్రమాలు వేగం అందుకున్నాయి. రవితేజ సరసన క్రేజీ హీరోయిన్ శ్రీలీల మరోసారి నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



# విండీస్‌పై పాక్ బోణీ

**బలగం టీవీ, హైదరాబాద్**

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్థాన్ ఘన ఆరంభం చేసింది. శనివారం జరిగిన తొలి వన్డేలో పాక్ 5 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన విండీస్ 49 ఓవర్లలో 280 పరుగులు చేసింది. అఫ్రిది (4/51), నసీమ్ షా (3/55) బౌలింగ్ దాడికి కరేబియన్ జట్టు తట్టుకోలేకపోయింది. లక్ష్యాన్ని ఛేధించడంలో పాకిస్థాన్ బ్యాటర్లు ధైర్యంగా ఆడారు. ఓపెనర్ సయిమ్ ఆయూబ్ (5) త్వరగానే ఔటైనప్పటికీ, హసన్ నవాజ్ (63 నాటౌట్), కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ (53), బాబర్ ఆజమ్ (47), హుసేన్ తలాత్ (41 నాటౌట్) అద్భుతంగా రాణించారు.

ముఖ్యంగా నవాజ్ – హుసేన్ తలాత్ ఆరో వికెట్‌కు 104 పరుగుల కీలక భాగస్వామ్యం అందించారు. జోసెఫ్ వేసిన 49వ ఓవర్‌లో నవాజ్ సిక్స్, ఫోర్‌తో పాక్‌కు విజయాన్ని అందించాడు. పాక్ 48.5 ఓవర్లలో 284/5తో లక్ష్యాన్ని ఛేధించింది.